
11/3/90

111



# అవినీతి

— పురిపాక శ్రీరామచంద్రమూర్తి

ఊర్వశి బార్ అండ్ రెస్టారెంట్‌లో మూడో రౌండ్‌లో కాళ్ళు రెండూ ఎడంగా పారేసి చేతులు పైకెత్తేసి డిక్లేర్ చేశాడు రఘుపతి.

"ఇండియా చస్తే బాగుపడదు"

అతని కెదురుగా కిశోర్ బాబు కూర్చుని ఉన్నాడు.. వాళ్ళిద్దరూ బార్‌కొచ్చి గంట దాటింది. డిమ్ లైట్లు, చిన్నగా శబ్దం చేస్తూ తిరుగుతున్న ఫ్యాను, ఆ రూమంతా ఘాటుగా గంభీరంగా ఉంది.

"ఎందుకని?" అడిగాడతను. బార్‌లో డిక్లరేషన్లూ, స్వీపింగ్ స్టేట్‌మెంట్లూ కిశోర్ బాబుకి నచ్చవు. కాని మిత్రుడు బాధపడతాడని అడిగాడు.

ఆ మూల కూర్చొనున్నాడు చూడు.. మీసాల వాడు.. వాణ్ణోసారి చూడు.. అన్నాడు రఘుపతి. బేరర్ కోసం చూస్తున్నట్టు చాలా కాజువల్‌గా తల తిప్పి చూశాడతను. మీసాల వ్యక్తి కనిపించాడు. అతను భారీగా, ఎత్తయిన నీళ్ళ టాంకుకి ప్రాణం వచ్చినట్టున్నాడు.

"చూశాను. వాడికీ, ఇండియా బాగుపడక పోవడానికి లింకేంవుంది?"

"ఉంది. ఆ వెధవల్లాంటి వాళ్ళు ఇండియా నిండా ఉన్నారు. అరగజానికొకడు"

"అతన్నీకు తెలుసా?"

"తెలుసు. లుంగీ, బనీనుతో ఈ ఊరొచ్చాడు. ఏం చేశాడో ఏమిటో సారా సబ్ కంట్రాక్ట్ పట్టాడు. రెండు సినిమాహాళ్లలో షేర్లున్నాయి. చూస్తుండగానే వ్యాపించి పోయాడు. రేపో మాపో మునిసిపల్ ఛైర్మన్ అయిపోయి, ఏదో ఒకటి ఖండిస్తూ స్టేట్ మెంట్ ఇస్తాడు."

కిశోర్‌బాబు మళ్ళీ మీసాల వ్యక్తి వైపు చూశాడు. ఆ కంట్రాక్టర్ బేరర్ కోసం తల తిప్పడంతో అతని మెళ్ళో బంగారుగొలుసు మెరిసింది. అతని ముందు టేబుల్ మీద బిస్లరీ సోడా, సగం ఖాళీ అయిన విస్కీ సీసా ఉన్నాయి.

"కష్ట పడ్డాడు, సంపాదించాడు, అందులో తప్పేంలేదు"

వాడి మొహం కష్టపడ్డాడు. మా నాన్న కష్ట పడూతూనే ఉన్నాడు నలభై ఏళ్ళ నుంచి. నెలాఖరు రోజుల్లో సి'టి' బస్సు చార్జీలకి డబ్బులుండవు. వాడి ఆస్తంతా నీతిగానే సంపాదించాడంటావా? అడిగాడు రఘుపతి రెండు గ్లాసులు నింపుతూ.

"లేదు. అవినీతిగానే సంపాదించాడు" అన్నాడు కిశోర్ బాబు.

మిత్రుడునింపిన గ్లాసు సగం ఖాళీ చేసి బార్‌లో ఎంత మిత్రుడితోనైనా సరే తగాదాకి దిగడం శ్రేయస్కరం కాదని అతనికి తెలుసు.

"ఆ డోర్ పక్కనే కూర్చొనున్నాడు చూడు. వాడు మాజీ సమితి ప్రెసిడెంట్. ఈ ఊళ్లో షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. ఫైనాన్స్ కంపెనీ ఉంది. పదవిలో ఉన్నప్పుడు ఎంత మింగేశాడో ఏమిటో. ఈ బార్‌కి వచ్చేవాళ్ళ సంగతి నాకు బాగా తెలుసు. పగలంతా అవినీతిగా డబ్బు సంపాయించే వాళ్ళే ఇక్కడికొచ్చి తగలేస్తారు." అన్నాడు రఘుపతి.

కిశోర్‌బాబు మాట్లాడలేదు. మాట్లాడటానికి అసలేం లేదు. కదిలిస్తే మళ్ళీ అవినీతి గురించి ఉపన్యాసం చెబుతాడేమోనని లోపల భయంగా ఉంది. గ్లాసు ఖాళీ చేసి రఘుపతే మళ్ళీ అన్నాడు.

అసలు మనం ఎవడెవడి అవినీతి గురించో చర్చిస్తున్నాంగాని మా మావ చేసే అవినీతి అంతా ఇంతాకాదు. ఆయన రెవిన్యూ డిపార్ట్‌మెంట్‌లో పని చేస్తున్నాడు. వాళ్ళింట్లో ఈ గదంత డైనింగ్ టేబుల్ ఉంది. ఫ్రిజ్, కలర్ టి.వి ఉన్నాయి. మంచి బాంకు బాలెన్స్ ఉంది. నీతిగా ఉంటే ఆయన జీతంతో నెల మొత్తం వెళ్ళదు.

"అవునవును, అవినీతి ఎక్కువై పోయింది" అన్నాడు కిశోర్ బాబు ఏం మాట్లాడక పోతే బాగుండదన్నట్టు.

నేనసలు ఇందుకే పేపరు చూడ్డంలేదు. ప్రతిరోజూ ఎవడో ఒకడి అవినీతి గురించి రాస్తారు. మనకి తెలియదనా పేపరు చూడ్డం

"నిజం, నిజం" అన్నాడు కిశోర్ బాబు.

"అసలు ఇండియా మొత్తం కుళ్ళి పోయింది. ఎవడో ఒక నియంతొచ్చి అవినీతి పరుల తోలు వలిచేస్తే తప్ప దేశం బాగుపడదు. మంత్రి దగ్గర్నించి మామూలు పోలీసు వరకూ అందరూ అవినీతి పరులే. ఇదంతా చూడలేకనే గాంధీ గారు పెందలాడే వెళ్ళిపోయారు. ఒరే కిశోరూ మనం అసలు ఆలోచించంగానీ, తలుచుకుంటే చాలా బాధగా ఉంటుంది. ఏమంటావు?"

కిశోర్ బాబు ఏమీ అనలేదు. గ్లాసులో మిగిలింది తాగేసి మళ్ళీ నింపుకున్నాడు. దేశంలో అవినీతి అంతా గ్లాసులో విస్కీమీద తేలుతున్నట్టు తదేకంగా చూస్తున్నాడు రఘుపతి.

వాళ్ళిద్దరూ గమనించలేదుగాని ఇరవై ఏళ్ళ లేత, ఎర్రని కుర్రాడు ఆ గది తలుపు దగ్గర నిలబడి తాగుతూ కబుర్లు చెప్పుకుంటున్న వాళ్ళ వైపు భయంభయంగా బెదురుగా ఆశ్చర్యంగా కుతూహలంగా చూస్తున్నాడు.

అతను పూర్తిగా లోపలి కొచ్చి ఒక్కో టేబుల్ దగ్గర ఆగుతూ ముందుకొస్తున్నాడు. రఘుపతి తలెత్తి ఆ కుర్రాడి వైపు చూశాడు. చూడగానే వీణ్ణెక్కడో చూసినట్టుందే అనుకున్నాడు. చూడ్డం కాదు పరిచయం కూడా ఉంది. ఆ కుర్రాడు ఇంకొంచెం దగ్గరికొచ్చాడు. అప్పుడు గుర్తు పట్టాడు రఘుపతి. వాడు తన తమ్ముడే. ఛీ..ఛీ రోజూ బార్ కొస్తుంటే కొన్నాళ్ళకి టి.విలో ప్రధాన మంత్రిని కూడా గుర్తు పట్టలేడు తను.

"ఏరా ఇక్కడికొచ్చావు?" అడిగాడు రఘుపతి కుర్చీలోంచి లేవకుండా. లేస్తే తమ్ముడు తనని మరీ 'ఇదిగా' చూస్తాడని అనుకున్నాడతను.

"నాన్న నిన్ను పిలుచుకురమ్మన్నాడు. అర్జెంట్"

"దేనికి?"

"మీ మావ గారొచ్చారు పండక్కి పిలవడానికి"

"వస్తే వచ్చాడు కానీ, ఈ మాత్రం దానికి నువ్వు బార్‌కి రావాలా"

"వదిన కూడా వెళ్ళమని చెప్పింది. నువ్వెక్కడున్నా వెంటనే తీసుకు రమ్మంది."

"ఆమె చెప్పగానే వచ్చేస్తావా?" అన్నాడు రఘుపతి. బార్‌లో ఉండగా భార్య ప్రస్తావన వచ్చినందుకు కుర్చీలో మహా ఇబ్బందిగా కదిలాడు.

"మరేం చెయ్యను? వాళ్ళునాన్నొచ్చినప్పుడే నువ్వింట్లో లేకపోవడం తల కొట్టేసినట్టుగా ఉందట."

"ఆడాళ్ళు అంత భారీగానూ మాట్లాడగలరు. అవునూ! నేనిక్కడున్నట్టు నీ కెలా తెలిసింది?"

రఘుపతి తమ్ముడు రఘుపతి లాగానే నవ్వాడు.

"నీ మెడికల్ షాపు ఫ్రెండ్ నడిగితే నువ్వు బార్ కెళ్ళావని చెప్పాడు" అన్నాడతను. మందుల షాపు రాగానే మీ వాడికి మందు గుర్తొస్తుందయ్యా అని ఆ మెడికల్ షాపు మిత్రుడు జోకేసినట్టు మాత్రం రఘుపతి తమ్ముడు చెప్పలేదు.

"పర్లే పర్లె నువ్వెళ్ళు. అరగంటలో వస్తానని చెప్పు"

"నువ్వెక్కడున్నావని అడిగితే ఏం చెప్పమంటావు?"

రఘుపతి ఆలోచనలో పడిపోయాడు. కిశోర్ బాబు ఆ సమస్య గురించి ఆలోచించదలుచుకోలేదు. మహా బుద్ధిమంతుడైన తను బార్ కెళ్తాడని రఘుపతి తమ్ముడు ప్రపంచానికి చాటి చెబుతాడేమోనని దిగులుపడి పోతున్నాడు.

ఐడియా! గ్రూప్ 2 పరీక్షలకి ఫ్రెండ్ రూములో ఘోరంగా చదువుతున్నావని చెబుతాను అన్నాడు రఘుపతి తమ్ముడు హుషారుగా

"భేష్... వెరీ గుడ్... నీకు బ్రైటెస్టు ఫ్యూచరుంది రా. ఇదుగో... మొన్నెప్పుడో సినిమా కెళ్తానని అడిగావుకదూ. ఇవాళ సెకండ్ షో కెళ్ళు. అయితే ఘోరం, భయంకరం అనే విశేష గణాలు వాడకు. మామూలుగా తెలుగు వార్తల్లా చెప్పు చాలు" అన్నాడు రఘుపతి. తమ్ముడు తనని ఎగతాళి చేయడానికే 'ఘోరం' అనే మాట వాడాడా అని అనుమానం వచ్చింది కాని తల విదిలించి జేబులోంచి పది రూపాయలు తీసిచ్చాడు.

రఘుపతి తమ్ముడు మళ్ళీ బార్ అంతా అపేక్షగా చూస్తూ బైటికెళ్ళాడు. ఏదో రోజు తనూ బార్‌కి రావాలని అప్పటికప్పుడే ప్రతిజ్ఞ చేసుకున్నాడతను. సినిమాలు చూడ్డం, రోడ్డు పక్క నిలబడి ఆడపిల్లన్ని చూడ్డంలోకంటె బార్‌లో మహా మజా ఉందని అతనికి నమ్మకం కుదిరిపోయింది. లేక పోతే అక్కడ అంతమంది ఎందుకుంటారు?

"ఏం చేస్తున్నాడు మీ వాడు!"

"ఏం చెయ్యడం లేదు. మొన్ననే ఇంటర్ పాసయ్యాడు. ఏం చెయ్యాలో తోచక సిగరెట్టు కాల్చడం నేర్చుకుంటున్నాడు"

"డిగ్రీలో చేర్చకూడదూ?"

"వాడికి సీటెవరిస్తారు? బేవార్సు వెధవ. గడ్డం ముదిరింది కాని చదువు లేదు. వాడసలు పాసయ్యే వాడే కాదు. మా మావగారూ, నేనూ హైదరాబాద్ వెళ్ళి వారం రోజులు మకాం పెట్టి వాణ్ణి గట్టెక్కించాం."

"టెక్నికల్ సైడైతే మంచిది. డిగ్రీలు వేస్టు."

అదే ఆలోచిస్తున్నాను. అశోకుడు, అక్బర్ చేసిన మంచి పనులు చదవలేని వాడు టెక్నికల్ కోర్సు ఏవేదుస్తాడా అని? మా ఇంట్లో అందరం ఇంతే. చదువు అచ్చి రాలేదు. మా పెద్దన్న ఎస్సెస్సీ తప్పి బిజినెస్‌లోకి వెళ్ళాడు. నాకూ చదువు మీద ధ్యాస తక్కువే.

నీకేం డిగ్రీ పూర్తి చేశావు. ఉద్యోగం చేస్తున్నావు. ఏం తక్కువ?

మన చరిత్ర నీకు తెలీదులా ఉంది. డిగ్రీలో చాలాసార్లు డింకీలు కొట్టాను. లెక్చరర్లతో మంచి దోస్తీ ఉంది కాబట్టి సరిపోయింది కాని లేక పోతే ఇప్పటికీ ఫైనలియర్ పరీక్షలు రాస్తుండే వాణ్ణి.

"మరి ఉద్యోగం?"

"అదీ అంతే. రికమెన్ చెప్పా, ఇంటర్వ్యూలప్పుడు మా మావగారే రంగంలోకి దూకి హెల్ప్ చేశారు."

"మీ మావగారి సపోర్టుతో ఉద్యోగం సంపాయించావా?" అడిగాడు కిశోర్ బాబు కొంచెం కోపంగా.

లేకపోతే మన గొప్పతనం చూసి ఉద్యోగం ఇస్తాడా ఎవడన్నా? అందుకే, ఆయన అండదండలతో అడ్డదారిన అడ్డదిడ్డంగా దూసుకెళ్ళాను. చెబితే ఆత్మస్తుతిగాడంటావుగాని నాది నెంబర్ వన్ జాతకం.

"సర్లె గ్రూప్ టూ పరీక్షలు నిజంగానే రాస్తావా?"

"రాస్తాను. ఢంకా బజాయించి మరీ పాసవుతాను. మా మావగారున్నంత వరకు మనకేం దిగుల్లేదు. అందుకే నేనాయన్ని ఫాదరిన్లా అనను. గాడ్ ఫాదర్ అంటాను. మా తమ్ముణ్ణి కూడా ఏదో కోర్సులో చేర్పించి ఒక దారికి తెద్దామనుకుంటున్నాను. లేకపోతే విడుదల కాని సినిమాలో హీరో కోసం అడ్వాన్సుగా అభిమాన సంఘం పెడతాడు."

కిశోర్ బాబు తల తిప్పి చూశాడు. మీసాల కంట్రాక్టర్ కుర్చీలోంచి లేచి భూమ్యాకర్షణ శక్తి సరిగ్గా పనిచేస్తోందో లేదో చూసుకొన్ని బైటికెళ్ళాడు. మాజీ సమితి ప్రెసిడెంటు ఇప్పట్లో కదిలేటట్టు లేడు. అతను తాగుడికి పునరంకితం అవుతున్నట్టు కనిపించాడు.

మరి నువ్వు మాత్రం చేసిందేవుందీ? వాడు అవినీతి పరుడు, వీడు అవినీతిగా డబ్బు సంపాదించాడని తెగ బాధపడ్డావుగా?"

రఘుపతి నవ్వి టేబుల్ మీదికి బాగా వంగి అడిగాడు.

అసలు అవినీతంటే ఏమిటో చెప్పుచూద్దాం.

అవినీతంటే అవినీతే. రూల్స్ ప్రకారం, చట్టం ప్రకారం వెళ్ళకుండా వేరేదారిలో సంపాదించడం. మొరాలిటీ, ఎథిక్స్, రూల్స్ పాటిస్తే నీతి. లేక పోతే అవినీతి.

మనుషులు అవినీతి పనులు ఎందుకు చేస్తారు?

బుద్ధిలేక అన్నాడు కిశోర్‌బాబు కోపంగా.

కాదు. నీతిగా వెళ్తే వాళ్ళకేం మిగల్దు. మీసాల కంట్రాక్టర్ నీతిపరుడైతే రోజూ ఇక్కడికి రాలేడు. కల్లు పాక దగ్గరే కబాబ్‌లు నీకుతూ కాలక్షేపం చేసే వాడు. మాజీ సమితి ప్రెసిడెంటు ఇంట్లో కూర్చుని టేప్ రికార్డర్‌లో భగవద్గీత వినేవాడు.

నీది మామూలు వాలికా? లేక పోతే ప్లాస్టిక్‌తో తయారు చేసిందా. ఇందాకేవో నియంతొచ్చి అవినీతి పరుల తోలు వలిచెయ్యాలన్నావు. ఇప్పుడేవో..

రఘుపతి చిరునవ్వు నవ్వాడు. అజ్ఞానాంధకారంలో మునిగి ఏడుస్తున్నావన్నట్టు మిత్రుడి వైపు సానుభూతిగా చూశాడు.

"ఒరే కిశోరూ! జాగర్తగా ఆలోచిస్తే కంట్రాక్టరూ, మాజీ సమితి ప్రెసిడెంటే ఆదర్శ మూర్తులని మనం ఒప్పుకుంటాం. సంపాదించారు. హాయిగా అనుభవిస్తున్నారు. అసలు నాకీ ఉద్యోగం చెయ్యడం కూడా ఇష్టం లేదు. కంట్రాక్టులు బెటరు. అది కుదరక పోతే బిజినెస్. నీతిని పట్టుకొని వేలాడితే లాభం లేదు. త్వరగా పైకి రావాలంటే అవినీతి పనులు చెయ్యాల్సిందే. నువ్వేదో గింజుకు చస్తున్నావుగాని అందులో తప్పేం లేదు."

"నీ అంత దొంగ రాస్కెల్ వెధవ ఇండియాలో ఎక్కడా ఉండదు" అన్నాడు కిశోర్ బాబు మహోగ్రంగా. అతనికి మిత్రుడి మీద చాలా కోపం వచ్చింది.

అందుకే ఇండియా చస్తే బాగుపడదని మూడో రౌండ్లోనే చెప్పాను అన్నాడు రఘుపతి కన్నుగీటి, కల్తీ అండ్ కన్నింగ్ నవ్వు నవ్వుతూ.

## చుట్ట వీరుడు!

ఆమధ్య బార్సిలోనాలో ప్రపంచ ఫుట్‌బాల్ పోటీలకు ఎంతోమంది హాజరయ్యారు. ఆటను ఉత్కంఠతో చూస్తూ అందరూ ధూమపానం చేశారు. అయితే ఒక స్పానిష్ పెద్ద మనిషి మాత్రం మాటి మాటికి నోట్లో సిగారు ఉంచి వెలిగించే తీరికలేక, ఒకేసారి 33 సెం.మీ పొడవైన చుట్టను నోట్లో పెట్టుకుని రైలు ఇంజనులా పొగ వదులుతూ అందరి దృష్టినీ ఆకర్షించాడు.

